# కుటుంబం

'దాన్ని కొట్టకండే' అంది అమ్మ.

అన్నయ్య విరిగిపోయిన క్రికెట్‌బ్యాట్ పట్టుకుని ఓ పక్క నాకు అందుబాటులో దొరికిన రోకలిబండతో నేను ఇంకో పక్కా ఆ కుక్కని చుట్టుముట్టాము.

'ముక్తా, జాగ్రత్త' అంటున్నాడు అన్నయ్య.

అది అక్కణ్నించి తప్పించుకుని పారిపోవడానికి చివరి సాహసం చేస్తున్నది. కాని అక్కణ్నించి కదలటానికి సందు చిక్కక మామీంచి దూకటానికి సిద్ధంగా ఉంది. ఆ లోపలే తలమీద కొట్టి దాన్ని అక్కడకక్కడే చంపేయాలన్నంత ఉద్రేకంతో ఉన్నాడన్నయ్య. వాడి కళ్లు కోపంతో మండిపోతున్నాయి. ఆ కుక్క ఇంతకు పూర్వం చాలాసార్లు ఇంట్లో పాలుతాగెయ్యడం, వెన్న పెరుగు తినెయ్యడం, అన్నం పప్పు ఎంగిలి చెయ్యడం వంటి కష్టాలు చాలా చాలా పెట్టింది. అది ఎప్పుడు దొరుకుతుందా అని అవకాశం కోసం చూస్తున్నాడు చాలా రోజుల్నించి అన్నయ్య. కొన్నిసార్లు దొరికినట్టే దొరికి తప్పించుకుని పారిపోయేది. ఈ రోజు దొరికిపోయింది. తప్పించుకుని పారిపోయేట్టు లేదు.

ఇవాళ —

నాన్నగారి ఆరోగ్యం బాగాలేదు. ఆయనకు గంట గంటకు కాఫీ ఇస్తున్నాము. డాక్టర్ సలహా. బంధువులు, మిత్రులు, నాన్నగారి ఆఫీసు వాళ్లూ — చూట్టానికి వస్తున్నారు. నిన్న కాఫీలకీ, టీలకీ రెండుపావులు ఎక్కువ పోయించుకున్నా

సరిపోలేదని ఇవాళ మరో నాలుగుపావులు ఎక్కువ పోయించుకుంది అమ్మ. మొత్తం పాలు దాదాపు తాగేసి, కొన్ని మా సందడి చూసి పారిపోయే హడావిడిలో ఒలకబోసి బయటపడుతుండగా కుక్క అన్నయ్య కంటపడింది. అన్నయ్య దాన్ని వంట గదిలోనే ఉంచి మూలన పడివున్న విరిగిపోయిన క్రికెట్‌బ్యాట్ అందుకున్నాడు.

తప్పదు. ఇవేళ ఈ కుక్కను చంపేయాల్సిందే. అంత కోపంగా ఉంది.

కుక్కపాలు తాగేసింది. ఇంట్లో పాలు లేవు. సమీపంలో పాలు ఎక్కడా దొరకవు. హోటల్‌కి పంపించి కాఫీలు ఎప్పటికప్పుడు తెప్పించుకోవాలి. హోటల్ కాఫీ నాన్నగారికి అస్సలు పడదు. ఏం చెయ్యటమో ఈ పాడుకుక్కల్ని?

అమ్మ హాల్‌లో ఎవరితోనో మాట్లాడుతున్నదల్లా మా సందడి చూసి, 'దాన్ని కొట్టకండే. వద్దురా విఠల్' అన్నయ్యను వారించి 'నువ్వు రావే ముక్తా' అని నన్ను పిలిచింది. 'వద్దా? ఎందుకు వద్దు?' అని అన్నయ్య అమ్మ మీద ఉరిమాడు. ఆ కుక్కని ఈ దెబ్బతో ఇంక ఇంటికి రాకుండా చెయ్యాలని అన్నయ్య పట్టుదల.

అమ్మకేక విని నేను కొంచెం వెనక్కి తగ్గాను. కుక్కల్నీ, పిల్లుల్నీ కొట్టడం అమ్మకు ఇష్టముండదు. వాటిని తిట్టుంది. దొంగముండొచ్చి తినేసిపోతున్నది చూడు అంటుంది మరీ కోపమొస్తే. అంతే. నేను వెనక్కి తగ్గాను. అమ్మ నన్ను కోప్పడుతుంది. అందుచేత నా పట్టుదల సడలింది. కాని అన్నయ్య మాత్రం కుక్కతో 'నీ రోజులు ముగిశాయిలే ఇవాళ్టితో' అన్నాడు. కుక్కకు తెలుస్తున్నట్టే ఉంది. బాగా భయపడిపోయింది.

ఇట్లాంటి సమయాల్లో తిట్లు తినేదాన్ని నేనే. ఇంతవరకూ కాఫీ కాచాను. హెడ్మాష్టరుగారు వచ్చి నాన్నగారి మంచం దగ్గిర కూర్చుని మాటాడుతుంటే వాళ్ల మాటలు వింటూ ఆఫీస్‌గదిలో నుంచుండిపోయాను. ఇంట్లో మేము ఎవరమన్నా పేషెంట్లం అయినప్పుడు ఆఫీస్‌గది ఆస్పత్రిగది అవుతుంది. మామూలుగా అయితే గెస్ట్ బెడ్‌రూమ్ కూడా అదే. నా అశ్రద్ధ వల్లనే కుక్క పాలు తాగేసింది. అమ్మ నన్ను తిడుతుందని లోపల్లోపల భయంగా ఉంది.

ఈ కుక్క మా ఒక్క ఇంటికే కాదు. మా ఇంటి చుట్టుపక్కల వాళ్లంతా దీని బాధ పడలేకుండా ఉన్నారు. ఓ రెణ్నెల్ల కిందట ఆ మధ్య సినిమా హాల్ ప్రొప్రయిటర్‌గారి భార్య సలసల కాగుతున్న వేణ్నీళ్లు దాని మీద పోసేశారు. దాంతో దాని ఎడం ప్రక్క కాలిపోయి పుండయింది. ఆ పుండుతో అది చాలా బాధపడింది. మెల్లగా ఆ పుండు — నెల పదిహేను దినాలకు పైగానే పట్టింది... తగ్గటానికి. ఇప్పుడు ఆ కాలిన మచ్చ కనిపిస్తూనే ఉంది. అయినా ఈ కుక్కకి బుద్ధి లేదు.

అమ్మ మళ్లీ 'అది చూలుతో ఉందిరా' అంది.

దాంతో అన్నయ్య తన బ్యాట్‌ని బొగ్గుల బస్తావేపు విసిరేసి 'ఇంకపో మళ్లీ ఇక్కడ కనబడకు' అని విసుక్కుని విసురుగా అక్కడనించి వెళ్లిపోయాడు. అది పారిపోవడానికి దారి ఇచ్చేసి నేనూ తప్పుకున్నాను. ఆ కుక్క నరకంలో యమభటుల్ని తప్పించుకున్నట్టు, మావేపు తప్పయిపోయిందన్నట్టు చూసి అక్కడినించి పారిపోయింది.

* * *

ఆ రోజు కాలేజీనించి వచ్చేసరికి అమ్మ ఇంట్లో లేదు. అన్నయ్యని అడిగితే 'డాక్టర్ గారి గరాజ్ దగ్గర చూడు ఉంటుంది. కుక్క పిల్లల్ని పెట్టింది. అక్కడే ఉదయం నించీనూ' అంటూ విసుక్కున్నాడు.

పుస్తకాలు షెల్ఫ్‌లో పెట్టేసి కుక్కపిల్లల్ని చూడాలన్న కుతూహలాన్ని ఆపుకోలేక అక్కడకు వెళ్లాను. అట్నించి వచ్చిన తర్వాతనే ముఖం కడుక్కోవచ్చులే అన్పించింది. గరాజ్ దగ్గర జనం మూక కన్పించింది. వీధిలోని పిల్లలంతా అక్కడే చేరారు. మృణాళినీ, శోభ, సత్య, అరుణ, బాలా త్రిపుర సుందరీ ఆ వింత చూస్తూ అక్కడే ఉన్నారు. పిల్లలన్నీ ముద్దుగా ఉన్నాయి. కళ్లు విడలేదు మూసికొన్నట్టున్నాయి. నిద్ర పోతున్నట్టు తల్లి మాత్రం రాజ్యాన్ని జయించిన గర్వంతో, ఓ పక్క పండుకుని పిల్లలకు కాపలా ఉంది. తన గొప్పతనాన్ని చూడటానికి ఈ లోకం తన కాళ్ల దగ్గరకు వచ్చారనే సంతోషంతో, ఎవర్నీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా చూస్తున్నది. కుక్క తినటానికి ఏవో తెచ్చి పెట్టినట్టున్నారు. రెండు పింగాణీ ప్లేట్లు అన్నం మెతుకులతో, ఎంగిలితో కనబడుతున్నాయి.

ఆ గరాజ్ దగ్గర ముగ్గురు నలుగురు అమ్మవయసు పెద్దవాళ్లు తప్ప అంతా చిన్నపిల్లలే. పెద్దవాళ్లల్లో మగవాళ్లు ఎవరూ లేరక్కడ. చలికాలం. గరాజ్ సదుపాయంగానే ఉంది. ఆ తల్లికుక్కకు రెండు మూడు దినాల పాటు తిండి ఏర్పాట్లు నేను అంటే నేను అన్నట్టుగా ఇష్టంగానే అంతా మాటాడుకున్నారు. మాతృత్వవేదన అర్థమయినట్టుంది. అందర్లోనూ సానుభూతి. ప్రేమ. కొంచెంసేపు ఆ దృశ్యాన్ని చూసుకుంటూ నుంచుని అమ్మనీ తమ్ముణ్ణీ తీసుకుని ఇంటికి వచ్చేశాను.

ఇంకా జనం — ముఖ్యంగా పిల్లలు అక్కడకు వచ్చి పోగయి చూస్తూనే ఉన్నారు. డాక్టరుగారి కుటుంబం — ప్రస్తుతానికి ఊళ్లో లేదు. గరాజ్‌లో కారు కూడా లేదు. డాక్టర్‌గారు ఒక్కరే ఉంటున్నాడు. అందుచేత సరిపోయింది. ఆంటీ ఉంటే ఇంతమంది ఆ గరాజ్ వేపు వచ్చేవారు కాదు. డాక్టర్ ఆంటీ

ఇరుగుపొరుగువాళ్లతో కలిసే మనిషి కాదు. ఆమె హోదా వేరు. ఆ చుట్టుప్రక్కల పాతిక ఇళ్లల్లో కారున్నది వాళ్లకొక్కరికే. ఆపదలో వైద్యం కోసం కూడా ఆ ఇంటికి వెళ్లటం తక్కువ.

మూడునాలుగు దినాలు ఆ తల్లికుక్క మీద ప్రేమ,అభిమానం చూపించినప్పటికీ తర్వాత ఎవ్వరూ అంత శ్రద్ధ తీసుకోలేదు. ఆ కుక్కే మళ్లీ ఇళ్లవద్దకు వెళ్లి ఆకలికళ్లతో చూసేది. నేను ఇంట్లో ఉన్నప్పుడు వస్తే వెతికి దానికి ఇంత పెట్టేదాన్ని. ఒకటి రెండు సార్లు తప్పించి అది నాకు మళ్లీ కన్పించలేదు.

కుక్కపిల్లను ఇంటికి తెచ్చుకుని పెంచుకోవాలనే ఆలోచన చేస్తున్నాడు అమ్మతో కరుణ. వాడు మా చిన్నతమ్ముడు. ఏడేళ్లు. మూడోతరగతి ఇప్పుడు. వాడి కోసమన్నా ఓ కుక్కపిల్లను తెచ్చుకుని పెంచుకోవాలనుకుంటున్నది అమ్మ. ఆ కుక్క పిల్లల్లో గోధుమరంగుతో ఒకటి చురుగ్గా కన్పించింది. దాని మీద మా అందరి దృష్టి పడింది. మరో రెండు తెల్లటి మచ్చలతో, ఒకటి నలుపు మచ్చలతో, ఇంకోటి పూర్తిగా నల్లగా ఉంది. తల్లిపాలు విడిచాకా ఆ గోధుమరంగు కుక్కపిల్లను తెచ్చుకుని పెంచుకోవాలని అమ్మ నిశ్చయించుకుంది.

నేను ఆరు చదువుతున్నప్పుడు ఒక కుక్కపిల్ల మా ఇంట్లో ఉండేది. నాన్నగారి క్రిస్టియన్ స్నేహితుడు... బదిలీ మీద వెళ్లిపోయాడు. వాళ్ల కుక్కను మాకు ఇచ్చేశారు. అల్సేషియన్. వాళ్లు పెట్టుకున్న పేరే సురేంద్ర. ఆ కుక్క ఒక చిన్న పిల్లవాడు అయినట్టుగా అమ్మ ప్రతిదానికీ 'సురేంద్రా ఇటురారా' అని పిలిచేది. త్వరలోనే ఇంట్లో అందరికీ మాలిమి అయింది. ముందు ఓ వారం రోజులు పాత యజమానులపట్ల బెంగపెట్టుకున్నట్టు కన్పించింది. అది మా ఇంట్లో అందరికీ ఆట వస్తువుగా ఎంతో ఆహ్లాదాన్ని కలిగించింది. ఆ జ్ఞాపకాలు ఇప్పుడు మళ్లీ కుక్కపిల్లను పెంచుకోవాలి అనుకున్నప్పుడు — సురేంద్ర అకస్మాత్తుగా జ్వరంతో ఒక్కరోజులో చచ్చిపోయింది. అమ్మ — సురేంద్ర చచ్చిపోతే తట్టుకోలేకపోయింది. త్వరగా కోలుకోలేకపోయింది. దాంతో నాన్నగారికి కుక్కల్ని పెంచడం మీద ఉన్న వ్యామోహం అంతా చచ్చిపోయింది. కావాలనుకుంటే ఇంకా మంచిజాతి కుక్కపిల్లలే దొరికేవి. కాని ఆ పిల్లల్ని తెచ్చి మాలిమి పెంచుకుని — వాటికి ఏమన్నా అయితే — మూగజీవాన్ని రక్షించలేక పోయామే అని బాధ పడడం ఇష్టంలేక తర్వాత కుక్కపిల్లల్ని తెచ్చుకోలేదు.

మళ్లీ ఇప్పుడు ఈ కుక్క పిల్లకోసం —

ఓ సాయంత్రం జాకెట్‌పీస్ శకుంతలాబాయికి కుట్టుకి ఇచ్చేందుకు వెళ్తుండగా ఆ గరాజ్ దగ్గర చిన్నపిల్లల గుంపు కన్పించింది. అంతా తొమ్మిది పదేళ్ల లోపలవాళ్లే.

హెడ్‌మాష్టరు గారి పాప, లెక్చరర్ గారి మేనల్లుడు, సినిమాహాల్ ప్రొప్రయిటర్ గారబ్బాయి — మరీ చిన్న పిల్లలు. దాదాపు పదిమంది వరకూ ఉంటారు. ఆ కుక్కపిల్లలను చూసుకుంటూ వినోదిస్తున్నారు. పండుకున్న తల్లి మీద గంతులేస్తూ కుక్కపిల్లలు తల్లిపాలు తాగుతున్నాయి. కొంచెంసేపు వీళ్లను చూస్తూ నేనూ అక్కడ ఆగిపోయాను. ఆ దృశ్యం నన్నెంత గాఢంగా ఆకర్షించిందంటే ఆ రాత్రంతా పదే పదే గుర్తు రాసాగింది.

అదే రాత్రి —

సుమారు తొమ్మిది గంటలకు హెడ్‌మాష్టర్‌గారిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ చుట్టుపక్కల ఇళ్లవాళ్లంతా ఆశ్చర్యపోయారు. ఏదో పొరపాటు జరిగిందని హెడ్‌మాష్టర్‌గారిపట్ల సానుభూతితో ఆందోళన చెందారు. పాపం, ఆయనకు గంపెడు సంతానం. ఆయన తప్పించి వేరే ఆధారంలేని కుటుంబం. పెద్దపిల్లలు పది, తొమ్మిది, ఎనిమిదీ, ఏడూ చదువుకుంటున్నారు. చిన్న పిల్లలు నాలుగూ రెండూ తరగతుల్లో ఉన్నారు. చిన్నపాప మూడేళ్లది. ఆ ఇంట్లో ఆయన మరదలు ఆత్మహత్య చేసుకుని ఇంకా నెల దినాలు కూడా కాలేదు. ఈ రోజు మళ్లీ ఈ విపత్తు ఎదురయింది 'చాలా మంచివాడు. సున్నితమైన స్వభావం' అంటుంది అమ్మ. దైవ సంబంధమైన మత సంబంధమైన సంస్థలతో ఆయనకు అనుబంధం. సేవాసంస్థలలో ఆయనకు పదవులున్నాయి. పట్నంలో ముఖ్యమైన మత సంబంధమూ, భక్తి సంబంధమూ అయిన ఆధ్యాత్మిక కార్యక్రమాలలో ఆయన పేరు పత్రికల్లో తప్పని సరిగా కన్పిస్తుంది. వాళ్ల స్కూల్‌లో, ఆయనకు మంచి పేరుంది. మా కాలనీ సాంస్కృతిక కార్యక్రమాలుగాని సంక్రాంతి, ఉగాది, వినాయక చవితి, ఆగష్ట్ 15, జనవరి 26 వంటి కార్యక్రమాలుగాని ఆయన లేకుండా జరగనే జరగవు. ఆయన ప్రసంగాల్లో గీతనించీ, వేదాలనించీ, హోలీ బైబిల్ నించీ, ఖురానే షరీఫ్ నించీ ఎన్నెన్నో సూక్తులు వినిపించటం — అవి అందర్నీ ఆకర్షించటం తెలిసిందే. భజనలు, సత్సంగాలు, అన్నదానాలు, పుణ్యతీర్థ యాత్రలు ఆ ఇంట్లో మామూలే. అట్లా రామాకృష్ణా అనుకునే దైవభక్తి గల ఆ బ్రాహ్మడు ఏంచేశాడా అని అందరూ విస్తుపోయారు.

ఆ రెండోరోజు —

కథంతా స్పష్టంగా తెలిసింది. ఎవ్వరూ నమ్మలేని విధంగా ఉంది. నెలదినాల క్రితంనాటి మరదలు ఆత్మహత్యకీ, ఈ పోలీస్ నిర్బంధానికీ మధ్య సంబంధం ఉందనీ, అది ఆత్మహత్య కాదనీ, బలమైన సాక్ష్యాధారాలు దొరికాయట. శవపరీక్ష

చేసిన అధికారులు లంచం తిన్న ఆచూకీలు తెలిసాయట. ఈ కథతో చాల పెద్ద కల్లోలం రేగింది కాలనీ అంతటా. ఆత్మహత్యగా కనిపించినా నిజానికి అది హత్యనేనట.

ఆ రాత్రి అమ్మా, నాన్నగారూ, అన్నయ్యా ఆత్మహత్యా, హత్య అన్న సమస్య గురించి మాట్లాడుకుంటూఉండగా విన్నాను. అమ్మ దాన్ని హత్య అనటంలో పెద్ద కుట్ర ఏదో ఉందన్నది నిజం కాదని, నిజం మెల్లగా తెలుస్తుందని వాదించింది. మా కాలేజీలో ఆ హెడ్మాష్టర్‌ను ఎరగని విద్యార్థులు లేరంటేనే మంచిది.

ఆ మాటలన్నీ వింటున్నాడు కరుణ కూడా. వాడికి ఏమర్థమయిందో, ఏ ఊహల్లో ఉన్నాడో ఏమిటో 'అమ్మా, ఆ కుక్క పిల్లల నాన్న ఏడమ్మా?' అని అడిగాడు. అమ్మా వినిపించుకోనట్లు తన స్వంతపనుల్లో మునిగిపోయింది.

వాడి ప్రశ్న ప్రశ్నగానే ఉండిపోయింది.

కుక్కల్లోనూ, పశువుల్లోనూ, పక్షుల్లోనూ కుటుంబ వ్యవస్థలేదని, మనుషుల్లోనే ఈ తల్లీ, తండ్రీ, అక్కా అన్నా, తమ్ముడూ, చెల్లెలూ వంటి బాంధవ్యాలు ఉన్నాయని వాడికి అర్థమయేట్టు చెప్పటం తెలీకనే అమ్మ వాడికి జవాబు చెప్పకుండా అక్కడినించి వెళ్లిపోయినట్టు అన్పించింది.

కుక్కపిల్లలని అవి తల్లిపాలు విడవకముందే అందరూ ఎత్తుకుపోయారు. మేము తెచ్చుకోవాలనుకున్న గోధుమరంగు కుక్కపిల్లని ప్రెస్‌మేనేజర్ రాజు తీసుకుపోయాడు. తతిమ్మా పిల్లలు ముందు నచ్చలేదు. ఇప్పుడు ఏవీ మిగల్లేదు.

ఇంట్లో కుక్కపిల్ల లేనందువల్ల అందరకూ ఉన్న గొప్ప ఆనందం తనకు లేనట్టు కరుణ బాధపడిపోతున్నాడు. మంచి కుక్కపిల్లని ఎట్లానన్నా సంపాదించాలని వాడి ఆలోచన. కుక్కపిల్లలతో ఆడుకుంటున్న ముచ్చట్లు స్నేహితులు చెప్పగా వింటున్నాడేమో మరీ ఉత్సాహపడుతున్నాడు. కుక్కపిల్ల కావాలి. అదే వాడి కోరిక ఇప్పుడు.

వాడి బాధపడలేక అమ్మ 'అవి మంచిజాతివి కాదురా. ఊరకుక్క. వాటిగోళ్లు లెక్కపెట్టాము కదా. పంతొమ్మిదీ, పద్దెనిమిదీ ఉన్నాయి. ఇరవై ఉంటేనే కాని మంచిది కాదు. చెడ్డవయితే వీధుల్లో వాళ్లని కరిచి తగాదాలు తెస్తాయి. మంచిజాతి కుక్క పిల్లలని చూసి తెచ్చుకుందాంలే' అని ఓదార్చింది. వాడికేమి అర్థమయిందో ఏమిటో అప్పటినుంచి మరి కుక్కపిల్ల మాట ఎత్తలేదు.

సరిగ్గా ఆ రోజుల్లోనే హెడ్మాష్టరుగారి కుటుంబం ఆ ఇల్లు ఖాళీ చేసి పాత టౌనులోని అద్దెతక్కువ ఇంట్లో దిగారు. ఇక్కడ ఇంటికన్నా పెద్దదేనంట.

సదుపాయంగా ఉందంట. హెడ్మాష్టరుగారు ఇక్కడ అవమానం భరించలేకనే ఇల్లు మార్చుకున్నాడని అనుకున్నారు. ఆ పిల్లలూ పెద్దవాళ్లూ రోడ్లమీద అప్పుడప్పుడు దీనంగా కన్పించేవాళ్లు. వాళ్లల్లో మార్పు కన్పించింది. ఈ సంగతి అమ్మతో చెపితే—

'తండ్రి చేసిన పనికి పిల్లలకీ, ఆ తల్లికీ శిక్ష' అని బాధపడింది.

హెడ్మాష్టరు ఖాళీచేసిన ఇంట్లో ఇప్పుడు చక్రవర్తి అనే ఓ బెంగాలీ ఆయన ఉంటున్నాడు. ఆయనకు స్టేషన్ రోడ్‌లో పింగాణీ షాపు ఉందట.

ప్రెస్ మేనేజర్ రాజుగారి చిన్నమ్మాయి మృణాళిని పుట్టిన రోజు పండగ. అమ్మతో వెళ్లాలని తయారవుతున్నాను. ఆ రోజు కాలేజీలో అమెరికన్ పీస్‌కోర్ మెంబర్ ప్రసంగం ఉండటం మూలంగా మధ్యాహ్నం క్లాసుల్లేవు. త్వరగా ఇంటికి వచ్చేశాను. అమ్మ తనతో రమ్మని పిలిచింది.

రాజుగారింట్లో మేం తెచ్చుకోవాలనుకున్న గోధుమరంగు కుక్కపిల్ల కొంచెం పెద్దదయింది. ముద్దూ అధికారం రెండూ చెలాయిస్తున్నది. వచ్చిన వాళ్లని చూసి ఎవరు మీరు ఎందుకొచ్చినట్టు అన్నట్టుగా అరుస్తుంది. 'మన వాళ్లేరా — స్నేహితులు. మరి మన మృణాళిని పుట్టిన్రోజు చేసుకుంటున్నాం కదా — పిలిచాం కదా వస్తున్నారు. అట్లా గొడవ చెయ్యకు. బావుండదు. నువ్వు మంచివాడివి కదా' అని ఆ కుక్క పిల్లకి నచ్చచెప్పుకుంటున్నది రోజా ఆంటీ. రాజుగారు ఆ కుక్కను రౌడీని చెయ్యాలనుకున్నారని ఆంటీ నవ్వుతూ చెప్పారు. భార్య మాటలు విని రాజు అంకుల్ 'పదిమంది రౌడీలు పెట్టు' అని ఆ కుక్క పిల్లని ఎట్లానన్నా రౌడీనే చేయాలనుకుంటున్నట్టు చెప్పారు. వాళ్ల ఇంటి కాంపౌండ్ సమీపానికి ఏ కుక్కా (మనుషులు అని కూడా వ్యంగం) రాదట. అట్లాంటి శిక్షణ ఇచ్చారట. పోలీస్ వేటకుక్కల కన్నా చురుకయిందని పొగడ్తలు కురిపించారు.

అది మేం తెచ్చుకుని పెంచుకోవాలనుకున్న కుక్కపిల్ల

అమ్మపెంపకంలో అయితే అది మనుషుల్ని చూసి భయపడేదిగా, పిల్లిని చూసి ఇంట్లో దాక్కునేదిగా తయారయ్యేది.

రాజుగారు ఢిల్లీలో గవర్నమెంట్ ప్రెస్‌లో ఉద్యోగంకోసం ప్రయత్నం చేస్తున్నారనీ, వాళ్ల అన్నయ్య అక్కడ ఉన్నారనీ, ఆ ప్రయత్నాలు ఫలిస్తే రెండు మూడు నెలల్లో వాళ్లు ఢిల్లీ వెళ్లిపోవచ్చుననీ ఆరోజే మాటల్లో తెలిసింది.

అక్కణ్నించి వస్తున్నప్పుడు వేసవికాలం కావటంవల్ల ఇంకా చీకటి పడక పోయినా ఏడు గంటలపైనే అయింది. మున్సిపాలిటీ కుక్కలవ్యాన్ వాళ్లు ఒక కుక్క మీదకి తాడు ముడి విసిరి, ముడి బిగుసుకున్న తర్వాత కుక్కను పట్టుకుని వ్యాన్‌లోని

గజాల బోనులో పడవేసి తీసుకు పోవడం చూశాము.

ఇంటికి వచ్చేసరికి ఆ తల్లికుక్క దొంగమల్లే వెతుక్కుంటూ కన్పించింది. తలుపులన్నీ మూసేసి వెళ్లటంవల్ల ఏమీ దొరకలేదు పాపం.

తరవాత కొద్దిక్షణాల్లో మంచం మీద కూర్చున్న అమ్మ కళ్లనిండా నీళ్లు.

అమ్మ కన్నీళ్లు చూస్తే నాకూ ఏడుపు వస్తుంది. అమ్మకి సురేంద్ర గుర్తు వచ్చిందో ఏమో అనుకున్నాను.

కొన్నాళ్ల తర్వాత అమ్మే చెప్పింది మాటల సందర్భాన. ఆ రోజు కుక్కల వాన్ వాళ్లు పట్టుకుపోయిన కుక్క — అంతకు ముందు ప్రెస్ మేనేజర్ వాళ్లు పెంచిన కుక్కేనట. అది వీధుల్లో తిరగటం, కరవటంతో, తగువులు భరించలేక బెల్ట్ తీసేసి రోడ్డుమీద విడిచి పెట్టేశారట. అట్లా వీధుల్లో — క్రమంగా వీధికుక్కగా తయారయిందంట. కుక్కలను పెంచటం చేతకానివాళ్లు వాటి జోలికి పోకూడదు అని బాధపడింది అమ్మ. ఆ కుక్క వల్ల ఈ పిల్లలు కలిగాయట. ఈ తల్లి కుక్కకి — మున్సిపల్ కుక్కలవ్యాన్ వాళ్లు ఆ తండ్రి కుక్కను తీసుకుని పోయినట్టు తెలీదు కదా!

ఈ కుక్కలకథ మనుషులకథలాగే ఉంది. ఆ కథంతా కుక్కల కుటుంబంలా ఆసక్తి కల్గించింది.

రాజు అంకుల్ ఈ కుక్కపిల్లని కూడా అట్లాగే చివరకు విడిచిపెట్టేస్తారేమో దిక్కులేనిదయి వీధికుక్క అవుతుందేమో.

అడిగి తీసుకుందామా అమ్మా అన్నాను.

అట్లా ఇవ్వడాయన అంది అమ్మ.

దాన్ని తెచ్చుకుని పెంచుకోవాలని ఒకప్పుడు మేము అనుకోవటం వల్ల ఈ కథంతా. ఆ కుక్కపిల్లమీద జాలితో మరింత అభిమానం ఏర్పడిపోయింది.

హెడ్మాష్టరుగారు ఖాళీ చేసిన ఇంట్లో ఉంటున్న పింగాణీషాపు చక్రవర్తిగారితో రాజుగారికి దోస్తీ బాగా కుదిరింది. రాజుగారు చిన్ననాడు ఎనిమిదేళ్లు ఖరగ్పూర్‌లో ఉన్నారట. బెంగాలీ వచ్చు. దాంతో వాళ్లమధ్య స్నేహాలు బలపడ్డాయి.

అనుకున్నట్టుగానే రాజు గారికి ఢిల్లీలో ఉద్యోగం వచ్చింది.

మళ్లీ అమ్మతో చెప్పాను. ఆ కుక్క పిల్లను అడిగి తెచ్చుకుందామని.

'వద్దులేవే. బాగా కరవడం నేర్పించారు. ఇరుగుపొరుగు వాళ్లతో, రోడ్డుమీదవాళ్ల తగాదాలతో పడలేం' అని అమ్మ తిరస్కరించింది.

నేను ఊహించినట్టుగానే ఆ కుక్కపిల్లను — ఇప్పుడు బాగా పెద్దదయింది — చక్రవర్తిగారికి ఇచ్చి వెళ్లిపోయాడాయన. ఆ కుక్కపిల్ల మాత్రం — యజమాని

కనిపించక — వారం రోజులు బెంగపెట్టుకుని ఒకటే ఏడుపు ఏడ్చిందంట.

సుమారు ఆరుమాసాల తర్వాత ఒక సాయంత్రం అన్నయ్య నేనూ ఇంగ్లీష్ సినిమా మాట్నీ చూసి వస్తున్నాం.

రోడ్డు పక్కగా తల్లి కుక్క నిద్రపోతున్నట్టుగా కనబడింది.

ఇంటికి వచ్చిన తర్వాత అమ్మ కళ్లు ఎర్రగా, బాధతో కన్పించాయి. ఏమిటి అని అడిగితే కరుణ చెప్పాడు. ఆ తల్లి కుక్కని, చక్రవర్తి వాళ్ల కుక్క చేత కరిపించారనీ, ఇంట్లో పాలు తాగేసిందని చక్రవర్తి కుక్కని కొట్టాడనీ, తరువాత ఆ దెబ్బలకి గిలగిల తన్నుకుని మొరిగి మొరిగి ప్రాణం వదిలేసిందనీనూ.

ఎంత విషాదకరమైన దీనమైన బతుకు కుక్కలది!

అమ్మకు ఆ కుక్కల కుటుంబం అంతా పరిచయం. అవి తనకు సంబంధించిన ప్రాణులయినట్టు వాటిల్లో కుటుంబవ్యవస్థను కల్పించుకుని, వాటిమధ్య బాంధవ్యాలను సృష్టించుకుని అమ్మ బాధ పడుతుంది. కుక్కల వ్యాన్ వాళ్లు పట్టుకుపోయిన మగకుక్క భర్త అయినట్టూ, ఆ తల్లికుక్క భార్య అయిననట్టూ, చక్రవర్తిగారి కుక్క కొడుకు అయినట్టూ, కొడుకే తల్లిని కరిచి చంపినట్టూ — ఇదీ అమ్మ బాధ.

కుటుంబవ్యవస్థలేని కుక్కల జీవితానికి — కుటుంబ వ్యవస్థ ఉండి సాంఘిక కట్టుబాట్లూ, నీతి నియమాలూ పాటించని హెడ్మాష్టరులాంటి వాళ్లకీ మధ్య భేదం కనిపించదు.

చక్రవర్తిగారి కుక్కకు తెలీదా తను కరిచింది కన్నతల్లినే అని.

తెలీకపోవచ్చు.

మనిషికి తెలిసిందా ఏమిటి, జీవితంమీద గంపెడాశతో యౌవనంలో ఉన్న మరదలిని...

★ ★ ★

- ఆంధ్రప్రభ వారపత్రిక

*25 - 10 - 1967*